హడలెత్తిస్తున్న అల్పపీడనం



మొగలిపాలెంలో హడావుడిగా వరి పడుగు దులుపుతున్న రైతులు



గొల్లపాలెంలో వర్షం కురిసినా తడవకుండా ఉండేలా ధాన్యంపై బరకం కప్పుతున్న రైతులు

- తుపాను హెచ్చరికలతో రైతుల్లో దడదడ
- ఆది నుంచి కన్నీటి సాగేనని దిగాలు

కాజులూరు: 'మూలిగే నక్కపై తాటికాయ పడింది' అన్న చందంగా తయారయింది నియోజకవర్గం లోని తొలకరి రైతుల పరిస్థితి. ప్రస్తుతం నియోజక వర్గ గ్రామాల్లో రైతులు పంటకోత, మాసూళ్ల పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ దశలో బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని మరో రెండు రోజుల్లో అది తీవ్ర తుపానుగా మారనుందని వాతవరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతన్నను కలవరానికి గురిచేస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలోని తొలకరి పంట వర్షాల బారిన పడుతూనే ఉంది. సాగు చివరి దశలో సంభవిస్తున్న అల్పపీడనాలు, తుపాన్లు వ్యవసాయదారులకు తీవ్ర నష్టాలకు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది తొలకరిలో ఒక పక్క చీడపీడలను ఎదుర్కోడానికే ఇబ్బంది పడుతున్న రైతన్నపై వాతావరణం కూడా కన్నెర్ర చేస్తుంది. చేరడు గింజలు అందంగా చేతికి దక్కుతాయని ఆశిస్తున్న రైతును అన్ని దశల్లోనూ అశనిపాతంలా వర్షాలు వెంటాడుతున్నాయి. ఈ ఏడాది తొలకరి తొలి దశలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో నారుమడులు, వెదచల్లిన పొలాలు నీటమునిగి కుళ్లిపోయాయి. నాట్లు వేసిన పొలాల్లో మొక్క వేరు నాటకపోవటంతో సక్రమంగా దుబ్బు కట్టలేదు. పంట చిరుపొట్ట దశలోనూ మరోసారి భారీ వర్షాలు కురవడంతో మొవ్వులోకి నీరుచేరి గెలలు సరిగా రాలేదు. మొత్తానికి దిగుబడి ఆశించినంతగా కనిపించలేదు. ఖరీదైన ఎరువులు, మందులు వాడి పంటను కంటికి రెప్పలా కాపాడుతూ చివరి దశ వరకూ నెట్టుకొచ్చారు. అయితే ప్రస్తుతం అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని దీని ఫలితంగా మరో రెండు, మూడు రోజులలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి తుపానుగా మారనుందని వాతావరణ ప్రచారమాధ్యమాల ద్వారా హెచ్చరికలు జారీచేస్తుంది. పండించిన పంటను ఏదోలా ఒబ్బిడి చేసుకుందామంటున్న తరుణంలో తుపాన్ల ప్రచారం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నియోజకవర్గ గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 53 వేల ఎకరాల్లో సార్వా సాగుచేశారు. కె గంగవరం మండలంలో 30 శాతం, రామచంద్రాపురం మండలంలో 40 శాతం కాజులూరు మండల గ్రామాల్లో సుమారు 50 శాతం పంట ప్రస్తుతం మాసూళ్ల దశలో ఉంది. గురువారం అకస్మాత్తుగా ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వాతావరణం వర్షం కురిసేలా మబ్బులు, మబ్బులుగా మారటంతో మాసూళ్ల దశలో ఉన్న పంటను దక్కించుకునేందుకు రైతులు నానాతంటాలు పడ్డారు. పొలాల్లో ఉన్న వరి పనలను ఒడ్డుపై కళ్లాల్లోకి చేర్చి అదురుబెదురుగా మాసూళ్లు నిర్వహించారు. పొలంగట్లపై రాశులుగా ఉంచిన ధాన్యాన్ని రైతులు హడావుడిగా సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల నుంచి పంటను దక్కించుకోవడానికి ఆపసోపాలు పడుతుంటే ఈ నెలాఖరు నాటికి మరో తుపాను సంభవించనుందంటూ అధికారుల నుంచి వస్తున్న ప్రకటనలు రైతులను మరింత కలవరానికి గురిచేస్తున్నాయి. ప్రస్తుత సమయంలో వర్షాలు రైతాంగానికి అన్ని విధాలుగా నష్టాలనే కలగజేస్తాయని రైతులు చెబుతున్నారు.

చేలకు నిప్పు.. రైతుకు ముప్పు



కె.గంగవరంలో పంట పొలాలకు నిప్పు పెడుతున్న రైతులు

- తగులబెడితే సూక్ష్మజీవులు నాశనం
- నిస్సారంగా భూములు
- పెరుగుతున్న కాలుష్యం

కె.గంగవరం: నియోజకవర్గంలో 50 శాతం వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. గతంలో కన్నా ఈ ఏడాది ఎక్కువ శాతం యంత్రాల ద్వారానే వ్యవసాయ పనులను పూర్తి చేశారు. యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల గడ్డి ముక్కలు చేలో పడిపోయి ఉంటున్నాయి. ఇలా పడిపోయిన గడ్డిని రైతులు ఒబ్బిడి చేయకుండా నిప్పు పెడుతున్నారు. నియోజకవర్గంలోని కాలుజూరు, రామచంద్రపురం పట్టణం, రూరల్, కె.గంగవరం మండలంలోని గ్రామాల్లో ప్రస్తుతం రైతులు చేలకు నిప్పు పెట్టే పనిలో బిజీగా ఉన్నారు. చేలో ఉండిపోయిన గడ్డిని సేకరిస్తే కూలి సొమ్ములు ఖర్చవుతాయని భావించి ఒక అగ్గిపుల్ల గీసేస్తే సరిపోతుందని రైతులు భావిస్తున్నారు.

పంట భూములకు చాలా నష్టం

మాసూళ్లు పూర్తి చేసిన పంట పొలాల్లోని గడ్డిని తగలబెట్టడం వల్ల భూమిలోని అతి చిన్న సూక్ష్మజీవులు చనిపోయి సారవంతం పోతుందని ఏఓ బలుసు రవి అంటున్నారు. పొలంలోని గడ్డి తగలబెట్టడం వల్ల వాయు కాలుష్యం బాగా పెరిగిపోవడంతో పాటు అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. నిప్పు పెట్టడడం వల్ల రైతులకు ఏ ఉపయోగం లేదని పొలంలో సూపర్ పాస్ఫేట్ వేసి దమ్ము చేస్తే దుబ్బులు, గడ్డి బాగా చివికిపోయి భూమిలో కలిసి భూసారం పెరుగుతుందని ఆయన చెబుతున్నారు.

సీఐ అశోక్‌కుమార్‌పై ఎన్నికల పరిశీలకుడికి ఫిర్యాదు



కోటిపల్లిలో సర్పంచ్ గోవిందు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి హర్షవర్ధన్

సాక్షి టాస్క్‌ఫోర్స్: రామచంద్రపురం సీఐ కడియాల అశోక్‌కుమార్‌పై రామచంద్రపురం మండలం తాళ్ల పాలెం గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె. హర్షవర్ధన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవిందు విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం సీఐగా అశోక్‌కుమార్ విధుల్లో చేరిన నాటి నుంచి రౌడీషీటర్‌గా ఉంటూ పేదల ఇళ్ల నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిల్వ ఉంచిన ఇసుక దోపిడీ కేసులో నిందితుడిగా ఉన్న దొంగల శ్రీధర్‌కు అనుకూలంగా ఉంటూ రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం మీద, మా కుటుంబం మీద తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. దొంగల శ్రీధర్ ఫిర్యాదుతో తన పైనా, తన కుటుంబంపైనా అదేవిధంగా తమ బంధువులపైనా, చివరికి మహిళల పైనా కూడా తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. దీంతో గురువారం రామచంద్రపురం పట్టణంలో జరిగిన కార్తిక వన భోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా సీఐ పాల్గొన్న అంశంపై ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ కోటిపల్లి శివాలయానికి వచ్చినట్లు తెలిసి నేరుగా ఆయనను కలసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ధాన్యంలో తేమ శాతం 17 మించనీయవద్దు

- అప్పుడే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుంది
- జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



సోమేశ్వరంలో ధాన్యం కళ్లాల వద్ద రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

రాయవరం: ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే ధాన్యంలో తేమ శాతం 17 లోగా ఉండేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు రైతులకు సూచించారు. మండలంలోని సోమేశ్వరం రైతు సేవా కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఇక్కడ జరిగిన ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన సమీపంలో ధాన్యం ఆరబెడుతున్న రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. మద్దతు ధర కన్నా అధిక ధర వస్తే రైతులు బయట మిల్లుల వద్ద విక్రయాలు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ మద్దతు ధర సాధారణ రకం 75 కేజీలు రూ.1725లు, సన్నరకం ఏ గ్రేడ్ రూ.1,740 లుగా నిర్ణయించారన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున త్వరితగతిన వ్యవసాయ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లను బోసుబాబు పరిశీలించారు. ఆయన వెంట ఆలమూరు ఏడీఏ కె. నాగేశ్వరరావు, ఏవో కె.ప్రభాకర్, గ్రామ వ్యవసాయ సహాయకుడు హరిబాబు,, ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులు ఉన్నారు.

'నాస్'ను విజయవంతం చేయాలి

- ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద నరసింహఫణి
- సర్వే చేసే విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు

మండపేట: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల స్థాయి తెలుసుకునేందుకు నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)ను విజయవంతం చేయాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద నరసింహఫణి సూచించారు. నాస్ సర్వే కోసం నియమితులైన విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహఫణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఈ సర్వే ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు థర్డ్ పార్టీగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను నియమించామన్నారు.

డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, సమగ్ర శిక్షణ ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ నాస్ సర్వేలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 104 పాఠశాలల్లోని 3, 6, 9 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 4న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పబ్లిక్ పరీక్షలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు1. ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. నాస్ సర్వే ఏ విధంగా చేయాలనే అంశంపై డిస్ట్రిక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు సురేష్, జాన్‌బాబులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసుల దాడి



నిందితుడు, మద్యం బాటిల్స్‌తో ఎక్సైజ్ పోలీసులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని రామచంద్రపురం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎక్సైజ్ ఎస్సై సుబ్బారావు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన కె.రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20 నిబ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో హెచ్‌సీ డేవిడ్, కానిస్టేబుల్ అప్పారావు పాల్గొన్నారు.

ఓటరు శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మండపేట: కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం మండపేట నియోజకవర్గంలో చేపట్టిన స్పెషల్ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఓటరు నమోదు అధికారి ఎం.బాల సరస్వతి సూచించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటు నమోదుకు అర్హులుగా గుర్తిస్తామన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవాలన్నారు. మార్పులు, చేర్పుల కోసం ఫారం 7,8 ద్వారా మాన్యువల్‌గా గాని ఆన్‌లైన్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తుల కోసం ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్ల జాబితాతో పాటు బూత్ లెవెల్ అధికారులను కూడా నియమిస్తామని ఆమె చెప్పారు. కొత్త ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటు హక్కు పొందాలని సూచించారు. ఈ నెల 29న ప్రచురించే ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాలను పరిశీలించుకోవడానికి పోలింగ్ స్టేషన్ల వద్ద ఉంచుతామని రిటర్నింగ్ అధికారి బాలసరస్వతి చెప్పారు.

104 సిబ్బంది నిరసన ప్రచారం



నిడసనమెట్లలో జెడ్పీటీసీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న 104 సిబ్బంది

కపిలేశ్వరపురం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ 104 సిబ్బంది వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. నిడసనమెట్లలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బుకు వినతి పత్రాన్ని అందజేస్తూ తమ ఆందోళనకు మద్దతు కోరారు. 104 యూనియన్ నాయకులు కె.సాయి ప్రసాద్, కె.లోవరాజు మాట్లాడుతూ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లను ఎరియర్స్ రూపంలో చెల్లించాలన్నారు. 104 సర్వీసులను గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి నిర్వహణ ఖర్చు తగ్గుతుందన్నారు. 2020లో విధుల్లోకి చేరిన సిబ్బందికి జీఓ నంబర్-7 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. సీనియర్ డ్రైవర్లను వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్య వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాలలు ఐకమత్యంతో కొనసాగాలి



ద్రాక్షారామలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

రామచంద్రపురం రూరల్: మాలలు ఐకమత్యంతో కొనసాగాలని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పిలుపు ఇచ్చారు. మండలంలోని ద్రాక్షారామ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ మాలల కార్తిక వనసమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఐకమత్యంతో సంఘం పటిష్టంగా ఉంటుందన్నారు. రాజకీయంగా తన అండదండలు కులానికి ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. అనంతరం కార్తిక వన సమారాధనలో వివిధ రంగాల ప్రముఖులు, మూడు మండలాల మాల నాయకులు కుటుంబ సమేతంగా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెట్టా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు అంబటి తుకారం, కొత్తపల్లి అరుణ, సంఘ నాయకులు కాటే ముత్యం, గుబ్బల శ్రీనివాస్, రవ్వా భూషణం, పోతుల మాధవ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్ట్ వద్ద శుక్రవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తికి స్వల్పగాయాలు కాగా, కారులో ప్రయాణిస్తున్న మిగిలిన ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. నర్సాపురం నుంచి రావులపాలెం మండలం రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి కారులో ఆరుగురు వ్యక్తులు వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న కారు అక్విడెక్ట్ చివరికి వచ్చేసరికి ముందుగా వెళుతున్న మరో కారుకు గుంతల కారణంగా షడన్ బ్రేక్ వేశారు. దీంతో ముందు కారును తప్పించే ప్రయత్నంలో వెనక కారుకు షడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి అక్కడే ఉన్న గోడని ఢీ కొట్టి రోడ్డుపై పడింది. కారు లోపల ఉన్న ఆరుగురు వ్యక్తులను స్థానికులు బయటకు తీశారు. ఈ ప్రమాదం కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది ప్రమాదం నుంచి అందరూ సురక్షితంగా బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఇందిరానగర్‌లో శుక్రవారం ఉదయం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకింటికి నిప్పంటుకుని కాలి బూడిదయింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేదునూరి ప్రసాద్‌కు చెందిన తాటాకిల్లుకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ.10 వేల నగదుతో పాటు ఫర్నిచర్, వాషింగ్ మెషీన్, టీవీ, సైకిల్, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. సంఘటన స్థలానికి అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీఎస్ కొండబాబు ఆధ్వర్యంలో ఎలఎఫ్ బలరామ్ తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.

కపిలేశ్వరపురం మండలం అధికారులు

ఎ.శాంతి	మండల ప్రత్యేకాధికారి	9154409527
చిన్నారావు	తహసీల్దార్	8008803196
వెంకటేశ్వరరావు	డిప్యూటీ తహసీల్దార్	9441814301
కేవీఎస్ రమేష్‌కుమార్	ఏఓ, వ్యవసాయ శాఖ	8331056560
డా.పీఎస్ఎస్‌డి రత్నకుమారి	వైద్యాధికారి, అంగర	9247861182
డా.కె.విజయదీపిక	వైద్యాధికారి అచ్యుతాపురం	9182650968
డా.సీహెచ్.రాకేష్ కృష్ణ చౌదరి	వైద్యాధికారి, వాకతిప్ప	9742129535
కె.తాతారావు	ఎంఈఓ, విద్యాశాఖ	9492479542
కె.శ్రీనివాసరెడ్డి	ఏఈ, హౌసింగ్	7093930492
వీరభద్రరాజు	ఆర్‌డబ్ల్యూఎస్	9440387471
ఎస్.షాలెంరాజు	ఏఈ విద్యుత్ శాఖ	9440812645
డా.సీహెచ్.ఇందుప్రియ	వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, కేపీపురం	9059032457
డా.వీవీరమణమూర్తి	వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, అంగర	9989789978
అధికారి గజలక్ష్మి	సీడీపీఓ, మండపేట ప్రాజెక్ట్, ఐసీడీఎస్	8500758785
త్రిమూర్తులు	ఏఈ ఇరిగేషన్ ఆలమూరు సెక్షన్	9989329772
సుబ్రహ్మణ్యం	ఏఈ ఇరిగేషన్ కోటిపల్లి సెక్షన్	9908484824
అజీజ్	ఏఈ, ఇరిగేషన్ రామచంద్రపురం సెక్షన్	8500786756
వి.సుజాత	ఏఈ, ఇరిగేషన్ ద్రాక్షారామ సెక్షన్	7702322777
దొరరాజు	సీఐ, మండపేట రూరల్	9440796537
డి.రవికుమార్	ఎస్సై, అంగర పోలీస్ స్టేషన్	9440900770
సాయి చంద్రిక	ఏఈ డ్రైయిన్స్, రామచంద్రపురం	8886066939
వై.వెంకటేశ్వరరావు	డిప్యూటీ ఈఈ, ఆర్‌అండ్‌బీ, ఆర్సీపురం	9440818285
వి.వెంకటరమణ	ఏఈ, ఆర్‌అండ్‌బీ, మండపేట సబ్‌డివిజన్	9440818537
జి.దుర్గాప్రసాద్	ఏపీఎం, ఐకేపీ	9652304198
దేవిడ్‌రాజు	ఎఫ్‌డీఓ, మత్స్యశాఖ	9948029350
కె.రవికిరణ్	ఏపీఓ, ఎన్ఆర్‌ఈజీఎస్	7702072981
డీవీ రాఘవులు	మండల ఇంజినీరింగ్ అధికారి	9966526720
కామేశ్వరరావు	ఎండోమెంట్ అధికారి	9908792945
పేపకాయల భాస్కరరావు	మేనేజర్, ఆర్టీసీ, ఆర్సీపురం డిపో	7382825536
కేడీఎస్ఎస్‌కుమార్	మేనేజర్, ఆర్టీసీ, రావులపాలెం డిపో	9959225537
వెంకటేశ్వరరావు	ఏఎస్‌డబ్ల్యూఓ, సోషల్‌వెల్ఫేర్	9492168780
కె.శివనాగమల్లేశ్వరరావు	కార్మికశాఖ అధికారి	9492555059
డీఎస్ఎన్ మూర్తి	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	9849352664
నాగేశ్వరరావు	ఎక్సైజ్ సీఐ ఆలమూరు	9701287828
కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	8712625210

క్లుప్తంగా

అగస్త్యేశ్వరస్వామికి లక్షపత్రి పూజ



కపిలేశ్వరపురం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: స్థానిక అగస్త్యేశ్వర పాప వినాశేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వై.కిరణ్ శర్మ తదితర వేద పండితుల పర్యవేక్షణలో దేవతామూర్తులకు లక్షపత్రి పూజ చేశారు. కార్తిక పూజలో భాగంగా దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

లొల్ల గుడిలో మహా సంప్రోక్షణ పూజలు



మహా సంప్రోక్షణ పూజలు చేస్తున్న వేద పండితులు

రాయవరం: లొల్ల గ్రామంలోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం మహా సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. కరప మండలం కరకుదురుకు చెందిన వైఖానస పీఠం అధ్యక్షుడు వి.గోపాలాచార్యులు, వేద పండితుడు అంగర అయ్యమాచార్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో పూజలు చేశారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వాస్తుపూజ, వాస్తు హోమం, మహా శాంతి హోమం, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకంతో సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ ఇటీవల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించిన సమయంలో కలిగిన చిన్నపాటి దోష పరిహారార్థం మహా సంప్రోక్షణ పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంగర బాబు, అంగర లక్ష్మీనారాయణ, శోభన్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న హర్షవర్ధన్



ద్రాక్షారామలో వేద పండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఎన్నికల అబ్జర్వర్ హర్షవర్ధన్

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారిని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్ అబ్జర్వర్, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె.హర్షవర్ధన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

కామనకు చైర్ పర్సన్ దుర్గారాణి పరామర్శ

మండపేట: ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఏపీసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావును మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని ఏడిద గ్రామంలో ఉంటున్న కామన నివాసానికి చైర్‌పర్సన్ దుర్గారాణి తన తండ్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడి రామారావును వెంటబెట్టుకుని వెళ్లారు. ఈ సందర్భంగా కామన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని చైర్‌పర్సన్ అడిగారు. అలాగే కామనను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ కొత్తపేట ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు , వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జొన్నపల్లి సత్తిబాబు కూడా ఉన్నారు.

వృద్ధుడిపై వ్యక్తి దాడి

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం మడికి అప్పారావు అనే వృద్ధుడిపై పలివెల వెంకటేష్ దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గొల్లపాలెం శివారు గుడారం కాలనీకి చెందిన మడికి అప్పారావు మార్కెట్ సెంటర్‌లోని ఒక పలావు సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం అదే గ్రామానికి పలివెల వెంకటేష్ పలావు సెంటర్ వద్దకు మద్యం తాగి వచ్చి అప్పారావుతో గొడవ పడ్డాడు. ఈ సంఘటనలో పలివెల వెంకటేష్ పలావు సెంటర్‌లో ఉన్న కూరకాయలు తరిగే కత్తితో మడికి అప్పారావు మెడపై దాడి చేశాడు. అయితే దాడి గమనించి అప్పారావు చేయి అడ్డుగా పెట్టి కొంచెం వెనుకకు జరగడంతో అతని చేయి, గెడ్డంపై కత్తిగాటు పడింది. స్థానికులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కు మార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.